(చినుకు మాస పత్రిక, ప్రత్యేక సంచిక 2010)

# ప్రాప్తం

దుర్దినం.

కాకపోతే అంతమాట అంటాడా? మాటా అది? కొలిమిలో ఖణఖణ కాల్చితీసిన కడ్డీతో పెట్టిన వాత!

పుండు సలుపుతోంది.

\+ + +

రాత్రి -

ఎక్కడో కుక్కల కాట్లాట. అరుపులు, మొరుగులు.

ఇక్కడ -

పక్కగా అదిగో రామలక్ష్మి. ఉండుండి మూలుగుతోంది. కుక్కిమంచంలో మసలుతూ వుంటుంది., మంచం కీళ్ల కిర్రు కిర్రుమంటూవుంటై. ఆమె కీళ్లూ, మోకాళ్లూ కూడా అంతే. మధ్య మధ్య - ఖంగు ఖంగుమని దగ్గు. బాధ తెలుసు. ఏం బాధో,

ఏం కష్టమో చెప్పదు. నాటువైద్యుడు ఆయనకి తెలిసిన ఒకటి రెండు పేర్లు చెప్తూ వుంటాడు. ఈమె రోగాలు ఆయన చెప్పే పేర్లవో కావో ఆయనకీ తెలీదు. వివరాలడిగితే?....

అడగాలంటేనే భయం. అడిగితే, పెద్ద డాక్టర్... తీసుకుపోవాలంటే - డబ్బు? డబ్బేదీ? ఏదీ డబ్బు??

వేలు వచ్చినై. లక్షలు సంపాదించాడు.

సున్నకి సున్న. హళ్లికి హళ్లి. మళ్లీ మళ్లీ పాత సామెత! పాత ఏడుపు. కరిమింగిన వెలగపండు!

'కరి' ఎవరు? హరి. అవును హరి.

"మొదటి 'నలుసు'. రామేశ్వరం పేరు పెట్ట మన్నాడు మామ. 'ఆ ఈశ్వరుణ్ణి ఈ వూళ్లో పెట్టినవాడు హరేలే' అని జోక్ చేసి మరీ - సుపుత్రుడికి నామకరణం చేశాడు తాను. హరి!"

హరి ఏం చేశాడు? హరించేశాడు. 'హరి యను రెండక్షరములు హరియించును! మిగిలిం దేమిటి? వట్టిపోయిన తానూ, రోగిష్టి పెళ్లాం.

డొల్ల. ఇంకో జీవం వుంది. అదిగో చాప మీద. దానికి అన్నీ ఆ చాపమీదే. ఆ తడుపులోనే దొర్లుతూవుంటుంది. నోరూ వాయీలేని మొద్దు. పుట్టినప్పుడూ, బారసాలవరకూ - ముద్దుగారే ముత్యమే. అందుకే ఆ పేరు. సర్వమంగళ! ఆ తర్వాతే తేలింది. కాలంకి కూడా కన్నుకుట్టటం వుంది. అందుకే సర్వమంగళని నోరూ వాయీలేని మట్టిబెడ్డని చేసింది. 'మెంటల్లీ రిటార్టెడ్'ట! తీగెలుపోయి, పగులువారిన వాద్యానికి పేరేమైతేనేం?

వెల్లకిలా పడుకున్నాను. గోలీకాయల్లాంటి కళ్లతో చూస్తున్నాను. పేరుకు ఇల్లు. పెంకు జారిన కప్పు. పొగచూరిన బొంగులు. బూజుపట్టిన మూలలూ, మసిబారిన బాదులూ. పక్కకి చూస్తే - మసిగుడ్డ కట్టినట్లు నల్లచారికల గోడలు, పాతవాసన వేస్తున్న సామాను. కుంటికుర్చీ. విరిగిన రెండు బెంచీలు. సొట్టలు పడిన ఇత్తడి గంగాళాలూ, గుండిగలూ, గిన్నెలూ, తప్పేళాలూ... గోడవారగా భోషాణం. ఆ పక్కన చిన్నాపెద్దా కావిడ పెట్టెలు... విసిరేసిన పిడకల గుట్టల్లా ఏమిటేమిటో వస్తువులు. ఎప్పుడు చేరినవో? అత్తామామల ఆరాటానికీ, తాపత్రయానికీ ఉదాహరణలుగా నిలిచివున్నై! ఇక్ష్వాకులనాటి వాతావరణం. ముతకవాసన వేస్తున్న గుడ్డలమూటలు ముసలివాసన వేస్తున్న పెళ్లలూడిన గోడలూ, పగిలిపోయిన మొద్దుగచ్చూ. పరిస్థితి సంగతి చెప్పేదేముంది. మూలుగూ, నసా....! ఎక్కడో - ఏ నట్టో పోవడాన -

ఆగిపోని కారు హారన్ గుండెని గీరుతోంది. చెవులు దిబ్బెడ వేస్తున్నె. ఉసురుసురులూ... ఛీ., ఛా లూ...

అదిగో రామలక్ష్మి. ఏమిటో చెప్తోంది...

అమ్మయ్య! హారన్ ఆగింది.

"ఏవండీ"

"చెప్పు. ఇక్కడే ఉన్నా" "అబ్బ... నొప్పి... నొప్పిగా వుందండి. ఆ మాత్ర వెయ్యండి" దగ్గుతెర. మాట తేలిపోయింది. తెముల్చుకుని లేచి, మంచంలో కూర్చుంది.

మాత్ర పడింది. పడుకుంది – రామలక్ష్మి.

గోడవారగా జారగిలపడ్డాను. గోడమీద బతుకుబొమ్మలు... వరసకట్టున్నై... చూస్తున్నాను.

"మీరీ నరక కూపంలో కుక్కచావు చావండిట్టాగే. నేపోతున్నా. నా చావు నే ఛస్తా." హరి వాగ్భూషణం!

హరించింది చాల్లేదు వాడికి. ఇంట్లో మిగిలిన మూడు నాలుగు వేలు చేసే వెండికుందులు తీసుకుని ఉడాయించాడు.

పోతూ పోతూ – ఓ కాగితపుముక్క

"అమ్మ పోయిందనో, నాన్న చచ్చాడనో నా కోసం వెతక్కండి. నే పోతున్నా."

మాటా అది? "పుత్రుడు" ఇచ్చిన కమ్చీదెబ్బ!

పుండు సలుపుతూనేవుంటుంది.

\+ \+ \+

దృశ్యం మారింది. కాలయంత్రం ఇంకా... ఇంకా... వెనక్కి 'భూతం'!

నాన్న ఎప్పుడో పోయాడు. అన్నయ్య. ముగ్గురు చెల్లెళ్లు. అందరివీ వానాకాలపు చదువులు. వదిన వచ్చింది. చెల్లెళ్ల పెళ్లిళ్లూ, అత్తింటికి పంపటాలూ, పురుళ్లూ పుణ్యాలూ, గుమాస్తా జీతమే నెట్టుకొచ్చింది. అమ్మ ఎటూ ఇంట్లో పనిమనిషీ, వంటమనిషీ. వదిన ఇద్దరు మగపిల్లల తల్లి! నాకు చదువు అబ్బలేదు. పెరట్లో పిచ్చిమొక్క తీరు.

ఆ వేళ –

"తిరిగినన్నాళ్లు తిరిగావు. ఇరవై యేళ్లు శరీరం మీదికొచ్చాయి. ఇంక నావల్లకాదు. తిండిపెట్టటం ఒక్కటే కాదు సమస్య. కొంపమీది కొచ్చిపడే ఊరి తగాదాలూ, రొచ్చూ నేను భరించలేను. వెళ్లి నీ బతుకు నువ్ బతుకు..." తేల్చి చెప్పేశాడు అన్నయ్య. అమ్మ మూగచూపు చూసింది. "నువ్వెట్టా పోయినా నాకనవసరం.

కానీ, నిన్ను చూసిరేప్పొద్దున మా కుంకలిద్దరూ భ్రష్టుపట్టిపోతే, చచ్చేదాకా నేనేడవలేను." వదిన చెవి మెలేసి నోరు మూసేసింది!

పుండు సలుపుతూనేవుంది!

+ + +

గతస్మృతులు... చింతనిప్పు కణికలు!

తనకా సెగ, పొగ, వేడి- తప్పవు.

నెలరోజులు తెనాలి బజార్లు కొలిచాడు. ఆ తర్వాత, గుంటూరు రాజేశ్వరీవిలాస్‌లో సర్వరైనాడు. ఆపైన విజయవాడలో చంద్రసేన లాడ్జిలో 'బాయ్' అవతారం. కడుపు నిండలేదు. కాలు నిలువలేదు.

అప్పుడు గుర్తుకొచ్చాడు – పొన్నూరు రాజారావు. తాము ఇద్దరూ 'లంబూ జంబూ'లు; 'డింగరీ డింభకు'లు! ఎప్పుడో చెప్పాడు వాడు. మద్రాస్‌లో సినీ 'ఫీల్డ్'లో వుంటున్నట్టు. అడ్రస్ సాధించాడు. రైలెక్కాడు.

రాజారావు – మనిషి దొరికాడు. మాట మారింది. పొన్నూరు తెలుగులో జార్జిటౌన్ తమిళం కలిసింది. బాగా ముదిరిపోయాడు. బీచ్ స్టేషన్ దగ్గర సైకిల్ మీద డోర్‌మేట్‌లూ, అండర్‌వేర్లూ అమ్ముతున్నాడు. మేడిపండు సామెత ఎదురయింది. బండి మీది చాయ్‌తో, సెంట్రల్‌కొచ్చేశాడు. విజయవాడే గమ్యం.

మధ్యాహ్నం మూడు గంటలైంది. ఎండ తుకతుకలాడుతోంది. మనసు చికాకుపెడుతోంది.

టిక్కెట్ కౌంటర్ దగ్గరికి చేరాడు. జేబులు ఖాళీ! ఎవరి హస్తలాఘవమో తనని ప్రేమించింది!

స్టేషన్ హాల్లో –

ఏడుపు మొహం. బెదురు చూపులు. మంచితనం కోసం మొహాల్లో పరిశీలన. 'దయాధర్మం' కోసం అర్థింపు.

వేళావిశేషం అంటే?

ఇదిగో, ఇదే –

రంగాచారి తటస్థపడ్డాడు. వయస్సు ఏభై పైమాటే. నల్లటి శరీరం. అరవకట్టు పంచె, పై ఉత్తరీయం, మొహాన్న నామాలు. తలపై సిగ. చేతిలో గోనెసంచీ.

వచ్చీరాని తెలుగులో ఆయన పలకరింపు. ప్రాణం లేచొచ్చింది. 'నిజంగా డబ్బు పోయిందా?'

అవునని కళ్లే చెప్పాయి.

పరామర్శ సాగింది. తన ప్రవర చెప్పు కున్నాడు. పళ్లబిగువున దుఃఖాన్ని ఆపుకుని, పరిస్థితి చెప్పుకున్నాడు. బతుకు దౌర్భాగ్యపు చినుగుల్ని కప్పుకోకుండా, విప్పుకున్నాడు.

మాటా మనసూ దగ్గరైనాయి. తిండిపెట్టించి రైలెక్కమన్నాడు. పొన్నూరులో కొడితే రామేశ్వరంలో పడ్డాడు.

తెలతెలవారుతోంది.

పవిత్ర పుణ్యక్షేత్రం రామేశ్వరం గాలులు స్వాగతిస్తున్నాయి. తూర్పు సముద్రం నిసర్గ గంభీరంగా సూర్యకిరణాల్ని ఆహ్వానిస్తున్నది.

సన్నటి సందుగొందులు దాటుకుంటూ, పడమరవీధికి వచ్చారు తానూ, రంగాచారీ!

అదే ఆయన ఇల్లు. ఇల్లాలు తాయారమ్మ. చూడగానే పవిత్రంగా దణ్ణం బెట్టించుకునే గౌరీదేవిలాంటి మంగళమూర్తి. ఆరడుగుల ఎత్తరి. అరవకట్టుతో పూజాదికాలు పూర్తిచేసుకున్నట్టు తోస్తోంది. తర్వాత పరిచయం – పదిహేను పదహారేళ్ల యువతి. రంగాచారీ తాయారమ్మల కూతురు. ఏకైక సంతానం. తల్లి పోలికలో రామలక్ష్మి! కుడికన్ను మెల్ల. ఎడమకాలికి పోలియో!

త్వరత్వరగానే ఆ యింటి పరిస్థితులకీ, ఆ క్షేత్రం విశేషాలకీ అలవాటుపడ్డాడు తాను. తమిళం కొట్టినపిండయిపోయింది.

తెల్లవారుఝామునుంచే దినచర్య మొదలు. స్నానాదికాల తర్వాత సముద్రపు వొడ్డుకు చేరటం. యాత్రికుల్ని మాటల్తో ఆకట్టుకోవటం, సముద్ర స్నానాలకి సంకల్పం చెప్పటంతో ప్రారంభం. తెలుగు బృందాల్ని పట్టుకోవటం తనపని. సంకల్పం, దేవాలయంలో ఇరవై రెండు బావుల్లో స్నానాలు ఏర్పాటుచేయటం, భోజన వసతుల్ని చూడటం, కావాలంటే ఊళ్లో రామపాదుకలు, విభీషణ మందిరం వంటివి చూడటానికీ, ధనుష్కోటి పోయిరావటానికీ వాహనాన్ని సమకూర్చటం... ఇదే కార్యక్రమం.

ఎక్కడ, ఎంతెంత వీలయితే అంతంతగా డబ్బులు దండుకోవటం. కమీషన్ పట్టటం.... ఆధ్యాత్మిక విశేషాలూ, విశ్వాసాల బలహీనతలూ, వ్యాపార రహస్యాలూ బాగానే ఒంటబట్టించుకున్నాడు. రంగాచారీ డబ్బు బాగానే విదిల్చేవాడు తనకు. తనద్వారా తెలుగు గిరాకీలూ చాలా వచ్చేవి. పర్వదినాల్లో, పండుగరోజుల్లో పంట బాగా పండేది!

మనుషుల్ని చదవటం, అవసరాల్నీ, అవకాశాల్నీ వినియోగించుకోవటం,

మాట చాతుర్యం అద్భుతంగా అబ్బినై. ఇంటా బయటా పేరూ వచ్చింది.

వ్యవహర్తగా రాటుదేలాడు. విశ్వం అంటే రంగాచారి ఛాయావాడనే పేరు వచ్చేసింది.

సంవత్సరాలు గడిచిపోతున్నాయి.

రామలక్ష్మి చూపుల్తో, ప్రవర్తనతో కవ్విస్తూ వుండేది.

ఒకరోజు - కనుచీకటివేళ,

అమ్మానాన్నా ఇంట్లో లేరు. దొడ్లో రాచవుసిరిక చెట్టు కింద నిలవేసింది. చేతికి అందుతున్న కొమ్మని పట్టుకుని నిలబడింది. వయ్యారాలు పోతోంది. విరగకాసిన చెట్టు. ఆడపిల్ల ఊపుకు నిలవరించుకోలేక కాయల్ని రాల్చింది. నిలువెల్లా మెల్ల (!) కళ్లు చేసుకుని అడిగేసింది, "నేనంటే ఇష్టం లేదా?" అని. చదివిన ఏడోతరగతికి వయస్సు కూర్చిన ధైర్యమన్నమాట!

తాను తడబడ్డాడు. సమాధానం లేదు. నీళ్లు నమిలాడు.

ఆమే అన్నది మళ్లీ, "ఇంతలావు నల్లతుమ్మ మొద్దుకి నా అంత అందగత్తె పనికిరాదా?"

విస్తుపోయాడు. 'గడుసుదే' అనుకున్నాడు. నలుపురంగు ప్రస్తావనకి మనసు నొచ్చుకుంది. తప్పించుకుని వెళ్లిపోయాడు. వెనుకనుంచీ నవ్వు - జలజలా రాలింది. పెళ్లి గురించిన ఏ ఆలోచనా లేకుండా తనపనిలో తాను బిజీగా వుండటం నేర్చుకున్నాడు.

ఆ వేళ -

కృష్ణాజిల్లా నుంచీ ఒక గ్రూపు వచ్చింది. స్పెషల్ బస్. నలభైమంది. బేరం సాగుతుండగా, ఆ గ్రూప్ లీడర్ రంగాచారిమీద ఒంటికాలుపై లేచాడు. నోటిదురుసు మనిషి. పేచీ పడ్డాడు. వాగ్వాదం ముదిరింది. ఒకాయన హఠాత్తుగా రంగాచారి మీదికి చెయ్యెత్తి, చెంపమీద కొట్టబోతున్నాడు. ఒక్క ఉదుటున తాను ముందుకు దూకాడు. ఎత్తిన ఆ చేతిని అక్కడే గాలిలో తేలేట్టు పట్టుకుని, వెనక్కి మడిచి, గుడ్లెర్ర చేశాడు తాను. 'హద్దు మీరారా, మీలో ఒక్కడు కూడా రామేశ్వరం దాటడు. బంగాళాఖాతానికి సమర్పిస్తా జాగ్రత్త.' "పొగరూ గిగరూ అంటే పుచ్చెలెగిరిపోతయ్. కబడ్దార్" అని అగ్గి చల్లాడు. క్షణాల్లో వాతావరణం చల్లబడింది. వాళ్లల్లో వాళ్లే ఆయన్ని వెనక్కి లాగారు. రాజకీయబలం వుందిట ఆయనకి. అదీ ఆ పొగరుకి కారణం! చివరికి ఆ గ్రూపుని తామే 'మేనేజ్' చేశారు.

ఆ రాత్రి -

రంగాచారి తనని ఎంతో మెచ్చుకున్నాడు. దంపతులిద్దరూ మనసులో మాటని బయటపెట్టారు. 'రామలక్ష్మిని చేసుకుని చేదోడు వాదోడుగా వుండ'మన్నారు. శాఖా పట్టింపులూ, ఛాదస్తాలూ లేవన్నారు.

ఈ ప్రశంసా కిరణాల మధ్య –

ఆ వేళ ఆ గ్రూప్‌లో ఒకాయన అన్నమాట చెవుల్లో మారుమ్రోగుతూనే వుంది తనకు.

'వీళ్లకి ఉచ్చనీచాలు లేవు. డబ్బు మనుషులు. ఇక్కడంతా కుడి ఎడమల దగా, దోపిడీ'

మాటా అది? ములుకోలపోటు!

పుండు సలుపుతూనే వుంది.

+ + +

అమ్మ గుర్తుకొచ్చింది. అన్నయ్యకు ఉత్తరం రాశాడు. తిరుగుటపాలో జవాబు వచ్చింది. అమ్మ ఎప్పుడో పోయింది. భార్యాపిల్లలతో అన్నయ్య బావమరిది ఊరు విశాఖపట్నం చేరాడట. నీ బతుకు నువ్ బతకమని పాతసలహాని పునర్వచించాడు.

మనసు వ్యాకులపడింది. రక్తసంబంధం! పుండు సలుపుతూనేవుంది.

+ + +

కొత్త జీవితం. రామలక్ష్మితో కాపరం.

మనసులో ఓ మూల తెలియని అసంతృప్తి. దాన్ని అంతలోనే మరపించే ఊపిరి సలపని వ్యాపకాలు. సంపాదన మీద సంపాదన. కొత్తగా అభిషేకాలు ఏర్పాటుచేయటం. దానాలూ, ధర్మాలూ... కమిషన్లూ...

పైలాపచ్చీసుగా వుంది. పూలపల్లకీగా వుంది జీవితం. సంతానం తయారైంది. హరీ, సర్వమంగళా!

ఈమధ్యలో మావగారికి పక్షవాతం. మంచానపడ్డాడు. ఆయన సేవ చాలనుకుంది కాబోలు – అత్తమ్మ హఠాత్తుగా పోయింది. బతుకు గీతలకి కార్యకారణ సంబంధాలేం వుంటై కనుక, ఆమె మరణించిన పధ్నాలుగో రోజున రంగాచారి హంసా లేచిపోయింది.

పిల్లలు పెద్దవాళ్లవుతున్నారు.

హరి తన చాలులో పడ్డాడు. చదువబ్బలేదు. బలాదూరు తిరుగుడు ఒంటబట్టింది. తాతా అమ్మమ్మా కట్టడీ, కట్టుబాటూ తప్పిపోయినై.

ఇంట్లో రోజూ యుద్ధమే. అడిగిన డబ్బు ఇవ్వకపోతే ఎంతమాటంటే

అంతమాట అనటం కాదు. చేతిలో ఏముంటే దానితో కొట్టటమే. బల ప్రయోగమే వాడి ఆయుధం. రొల్లుకు పోయిన సొమ్మంతా మధుర పాలయ్యేది. ఏం వ్యసనమో తెలీదు. ఎంత తీసుకుపోయినా ఖాళీచేతుల్తో తిరిగొచ్చేవాడు. తానూ రామలక్ష్మీ నెత్తీనోరూ కొట్టుకున్నారు. వాడిలో ఏమార్పూ రాలేదు. పైగా మురికికూతలు కూస్తాడు. ఒకసారి తల్లితో మాటమీద మాటగా పోట్లాడుతూ అన్నాడు, "పందుల్లా దొర్లుకుంటూకంటే సరా, పోషించే బాధ్యతా మీదే. చావండి" తాను చెంప పగలగొట్టపోతే, వాడూ చెయ్యెత్తాడు.

ఇద్దరికీ కళ్లనీళ్లు తిరిగినై.

మాటా అది. గుండెమీద సమ్మెట వేటు కాదూ?

పుండు సలుపుతూనే వుంది!

\+ \+ \+

ఇవాళ-

వయసయిపోయింది. సుగరూ, బీపీ తనకు రామలక్ష్మి సరేసరి. రోగిష్టి బతుకు. ఖర్మగాలి ఆమె ముందుగా... పోతే...? సర్వమంగళ? భయం వెన్ను చరిచింది. కళవళపడ్డాడు. ఊహకే వణికిపోయాడు.

కన్ను చెమర్చింది. తుండుతో మొహం తుడుచుకుని కూచున్నాడు. ఒళ్లంతా విరగ్గొట్టినట్టుంది. తలనొప్పి. లోకాక ఉన్నట్టుంది. ఉదయపవనాలు పలకరిస్తున్నాయి.

ఐదయింది. ఓపిక చేసుకుని లేచాడు. స్నానం చేసి శంకరమఠం ఎదురు సముద్రం దగ్గరికి నడిచాడు.

అదిగో - అప్పుడే,

హైదరాబాద్‌వాళ్లు ఆరుగురు తగిలారు. ఎవరో ఆఫీసర్లు ముగ్గురు. ముగ్గురు స్త్రీలు. సంకల్పం, బావిస్నానాలు, భోజనాలు, వాహనం... "గుత్త"కి చెప్పమన్నారు. మొత్తంగా రెండువేల మూడువందలు చెప్పాడు. ఒకాయన వంకరనవ్వుతో అడిగాడు, "ఇందులో తమ కమీషనెంత?" అని. మనస్సు చివుక్కుమంది. ఎందరో యాత్రికులు అడిగే ప్రశ్నే. చేసే వెటకారమే. అన్యాపదేశంగా ప్రదర్శించే ఈసడింపే. అలవాటుపడిన దూషణే. అయినా ముల్లుగుచ్చుకుంది.

క్షణం తెరపినీయకుండా అంతలోనే ఆయనే అన్నాడు "వెయ్యి రూపాయలిస్తాం మొత్తం. అన్నీ ఆరేంజ్ చేయించండి". మిగిలినవాళ్లు అవునవు నంటూ వంతపాడారు. తనకు కడుపు రగిలిపోయింది. 'క్వాలిస్'హాడే పదిహేనువందలని ఏడుస్తున్నాడు!

తాను మాట్లాడకుండా ఇవతలికి అడుగేశాడు.

అదిగో, సరిగ్గా అప్పుడే ఆయన ఆ మాట అన్నది. మాటా అది? కాదు. కొలిమిలో కాల్చితీసిన కడ్డీతో పెట్టిన వాత!

"వీళ్లంతా ఇంతేరా. నిత్యదరిద్రులు. పెద్ద పరాన్నభుక్కులు. ఎన్నెన్ని మోసాలూ, అన్యాయాలూ చేసినా, ఎంతెంత సంపాదించినా వీళ్ల దౌర్భాగ్యం తీరదు. వీళ్లు సంపాదించిందంతా వీళ్ల సంతానం నాశనం చేస్తారు. చివరికి వీళ్లేమో రోగాల్తో, రొష్టులతో తీసుకు తీసుకు ఛస్తారు. ఇది వీళ్లకి మునుల శాపంట తెలుసా?"

తాను అవాక్కయ్యాడు. తల తిరిగిపోయింది. కళ్లు భైర్లు క్రమ్మినట్లయింది. తూలిపడబోయి, అక్కడే కొబ్బరిబోండాల పక్కగా కూర్చుండిపోయాడు.

పక్కగా – ఇదంతా విన్న మరో బ్రాహ్మడు కాశీపతి అంటున్నాడు, "ఈ వెధవల్ని ఇంతంతదూరం రమ్మని ఏడ్చాడా దేవుడు? ఎన్నెన్ని లంచాలు పట్టే ఈ స్థితికొచ్చారు. మాకూ పెళ్లాం పిల్లలుంటారనీ, వాళ్లకీ ఇంత కరుడు నోట్లోకి పోవాలనీ ఎందుకనుకోరు. దుర్మార్గం ముండాకొడుకులు. ముక్తికీ షార్ట్‌కట్‌లూ, బేరాలూ....?!"

మనసు కలచినట్లయింది. వాదనలతో, వాదాలతో తేలే విషయాలా ఇవి? ఇంతకీ ఏ మునుల శాపం ఇది?!

పుండు సలుపుతూనేవుంది. సముద్రం మీదుగా సూర్యుడు కరకరలాడుతూ లేస్తున్నాడు!

\+ \+ \+

మాసశివరాత్రి –

తెలతెలవారుతోంది. స్నానం చేసి ముందుగా శంకరమఠంలోకి వచ్చాడు. స్వామికి దణ్ణం పెట్టుకున్నాడు. దేవాలయానికి వెళ్లాడు. దైవదర్శనం చేసుకున్నాడు. నెమ్మదిగా సముద్రం దగ్గరికి వచ్చాడు. ఒడ్డున ఓ పక్కగా చిన్న బండమీద కూర్చున్నాడు.

వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. దిక్చక్రంలో తెలియని వింతకాంతి పొడగట్టోంది. యాత్రికుల్ని అలరిస్తున్నాడు సముద్రుడు. స్నానాలు జోరుగా సాగుతున్నై. బ్రాహ్మణులూ, బొక్కెనలు పట్టుకు తిరుగుతున్న బ్రోకర్లూ, యాత్రికుల వెంట పడుతున్నారు.

నిన్నటివరకూ తానూ అదే వ్యవహారంతో బిజీ! నవ్వొచ్చింది. ఇప్పుడు మనసు ప్రశాంతంగా వుంది. శతసహస్రంగా మనుషులు, కార్యకలాపాలు, కార్యక్రమాలు, అమ్మకాలూ – కొనుగోళ్లూ! నిర్మోహతతో చూస్తూ కూర్చున్నాడు.

ఎవరో నలుగురు. దగ్గరగా వచ్చారు. "సంకల్పం చెప్తారా?" అడిగారు. లేచాడు. "ఎంతివ్వాలి?" "మీ ఇష్టం." "అట్టా గాదు. అడగండి" "అడగను. మీ దయ-నా ప్రాప్తం" ఆలోచనలో పడ్డారు. క్షణం తర్వాత "సరే, రండి" అన్నారు. కదిలారు.

స్నానాలయినై. ప్రార్థనశ్లోకాలు రెండు చెప్పాడు. ఒకటి 'వాసనాద్వాసు దేవస్యవాసితంతే జగత్రయం....', రెండోది 'ఆకాశాత్పతితం తోయం....' వాళ్లచేత అనిపించాడు. అర్థం చెప్పాడు. "సకలవేదసారం" "బాగుంది" అన్నారు. నలభై రూపాయలు చేతుల్లో పెట్టి దణ్ణం పెట్టారు. "దీర్ఘాయుష్మాన్‌భవ" మనస్ఫూర్తిగా దీవించాడు.

గుండె లోఅరలో ఎక్కడో - 'సర్వేజనాస్సుఖినోభవంతు' ప్రతిధ్వనించింది. వాళ్లు కదిలారు. పెద్దాయన అన్నాడు - తనకేసి చూస్తూ - 'శుభం భూయాత్' అని!

అక్కడ - ఇంట్లో - రామలక్ష్మి ఏదో కొత్తలోకంలోకొచ్చిన మనిషిలా మంచం మీదనుంచీ దిగి గబగబా దినచర్యకి ఉపక్రమించింది! వెయ్యేనుగుల బలం వచ్చినదానిలా తిరగసాగింది!

సర్వమంగళ - అన్నీ అర్థమైనదానిలా తానూ చేతులెత్తి గాల్లో ఏ దేవుడికో దణ్ణం పెడుతోంది!!